క్లుప్తంగా

కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి బాలసాహిత్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బుచ్చిరెడ్డి

కనగల్ : మండలంలోని చిన్నమాదారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి బాలసాహిత్య పురస్కారం అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవం సందర్భంగా సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. బుచ్చిరెడ్డి బాలసాహిత్య రంగంలో 15సంవత్సరాలుగా పిల్లల కథలు, గేయాలు, కవితలు, సమీక్షలు రాస్తున్నారు. ఆయన అవార్డు పొందడం పట్ల ఉపాధ్యాయులు, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

హఫీజొద్దీన్‌కు గ్లోబల్ ఐకాన్ విన్నర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న హఫీజొద్దీన్

కనగల్ : మండల కేంద్రానికి చెందిన మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు, గాయకుడు ఎండీ హఫీజొద్దీన్ ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ ఐకాన్ విన్నర్స్ 2025 అవార్డు పొందారు. మంగళవారం మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో శంకర్‌నారాయణ, సినీ రచయిత రామకృష్ణ, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, డాక్టర్ ఇందిరా విల్సన్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహ సంక్షేమ అధికారి గుజ్జుల శంకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. హాస్టల్‌లో 57ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల ఎస్సీ విద్యార్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో పాటు ప్రస్తుత విద్యా సంవత్సర స్టడీకండక్ట్ సర్టిఫికెట్‌తో పాటు కుల, ఆదాయ సర్టిఫికెట్లను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కరాటేలో లాక్షనిక్ సాగర్‌కు బ్లాక్‌బెల్ట్



బ్లాక్‌బెల్ట్, సర్టిఫికెట్ అందుకుంటున్న సాగర్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణానికి చెందిన మాస్టర్ గొల్లూరి లాక్షనిక్ సాగర్ ఎస్ఎస్ కరాటే అండ్ జిమ్నాస్టిక్స్ అకాడమీలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఇంటర్నేషనల్ డాన్ సెవెన్, ఇండియన్ చీఫ్ అసిస్టెంట్ ఎగ్జామినర్ సుదర్శన్ మాస్టర్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ అందుకున్నట్లు ఆయన తెలిపారు. లాక్షనిక్ సాగర్ సోదరుడు రిత్విక్ సాగర్ కూడా 3 సంవత్సరాల కిందటే బ్లాక్ బెల్ట్ సాధించాడు. కాగా ఇప్పటికే లాక్షనిక్, రిత్విక్‌లు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో బంగారు వెండి పథకాలను సాధించారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ ప్రభుత్వం అర్చకులు, ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్ పథకాలను ప్రకటించడం పట్ల ధూప దీప నైవేద్య అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ధూప దీప నైవేద్య పథకంలో పనిచేస్తున్న అర్చకులకు మరణానంతరం మెడికల్ గ్రాడ్యూటీ, వివాహానికి, ఇంటి నిర్మాణానికి, విద్య గ్రాంట్ ఇవ్వడం హర్షణీమన్నారు. కార్యక్రమంలో ధూప దీప నైవేద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ, అర్చకులు ఉన్నారు.

విరాళాల సేకరణ

నల్లగొండ టౌన్ : పట్టణంలో క్యూబా సంఘీభావ నిధి కోసం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కోట్ల అశోక్‌రెడ్డి, అవుట రవీందర్, జయప్రకాష్, యాదయ్య, గురువయ్య, శంకరయ్య, యాదయ్య ఉన్నారు.

ముమ్మరంగా సుందరీకరణ పనులు



తిప్పర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు



కల్వర్టు నిర్మాణం చేస్తున్న కార్మికులు



విగ్రహాల ఏర్పాటుకు నిర్మిస్తున్న దిమ్మె

తిప్పర్తి: మండల కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆర్అండ్‌బీ నిధులు రూ.9 కోట్లతో గత అక్టోబర్ నెలలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సుందరీకరణ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా తిప్పర్తి మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ రోడ్డు నిర్మాణం, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహాలు, ఫౌంటేన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు అక్టోబర్‌లో ప్రారంభమైనప్పటికీ కొంత కాలంగా నిలిచిపోయాయి.

తిరిగి ప్రారంభమైన పనులు

తిప్పర్తి మండల కేంద్రంలో సుందరీకరణ పనులు కొంత కాలంపాటు నిలిచిపోవడంతో మంత్రి కోమటిరెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల పనులు తిరిగి ప్రారంభించారు. ఇప్పటికే రోడ్డు మధ్యలో డివైడర్, విగ్రహాల ఏర్పాటుకు దిమ్మె నిర్మాణం చేపట్టారు. మండల కేంద్రంలో బ్రిడ్జి, సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు ఇరువైపులా విద్యుత్ స్తంభాలను తొలగించాల్సి ఉంది.

పనులు పూర్తి చేస్తాం

రోడ్డు డివైడర్‌ల నిర్మాణం, సీసీ రోడ్డు పనులు ప్రారంభించాం. ఒకవైపు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం. మెయిన్ సెంటర్‌లో కల్వర్టు, బ్రిడ్జి పనులు కూడా మొదలు పెట్టాం. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేస్తాం.

– గౌస్, ఆర్అండ్‌బీ ఏఈ

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం



నియోజకవర్గ స్థాయి శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యంపై మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం మండలంలోని కడపర్తి, నెల్లిబండ శివారులోని డంపింగ్‌యార్డు వద్ద పారిశుద్ధ్యం, తడి చెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వర్మీ కంపోస్ట్ తయారీపై మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు, మల్టీపర్పస్ సిబ్బందికి నిర్వహించిన నియోజకవర్గ స్థాయి శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలానికి రూ.5లక్షల చొప్పున తన నిధుల నుంచి రూ.30లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈనిధులతో తడి చెత్త సేకరణ విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టి ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాల విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ జిల్లా అధికారి వెంకయ్య, మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, వివిధ మండలాల ఎంపీడీఓలు చంద్రశేఖర్, జ్ఞానసుందర్, విజయలక్ష్మి, శ్రీనివాస్‌రావు, అధికా రులు నాగలక్ష్మి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాంలు అందజేస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : మండలంలోని చందనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో ఇంకుడు గుంతల నిర్మాణానికి సహకరిస్తానన్నారు. అదే విధంగా కిచెన్ గార్డెన్‌కు అవసరమైన మొక్కలను అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.అరుంధతి, ఏపీఎం వినోద, హెచ్‌ఎం ఎం.రాజశేఖర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కేతేపల్లి : ఇనుపాములలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నార్కట్‌పల్లి : బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కేతేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఇనుపాముల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముషం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని ఇనుపాముల గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వెంకట్‌రెడ్డి, కె.లక్ష్మీనారాయణ, జి.శ్రీనివాస్, ఎస్.దీప్తి, సుగుణమ్మ, వై.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ బోధనతో పాటు ఉచిత సౌకర్యాలు ఉంటాయని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామస్వామి, రాజు, శేషగిరిరావు, సుజాత, శ్యామల, రోహిణి, శ్రీనివాస్, ఆరోగ్యమ్మ, లక్ష్మి, జానకిరాణి ఉన్నారు.

మర్రిగూడ : ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బుడిగ అంజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లెంకలపల్లి వెంకటేశ్వర్లు, రత్నకుమారి, అంగన్‌వాడీ టీచర్ శారద, గ్రామస్తులు కారింగు నరసింహ, వడ్డె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన భోజనం వడ్డించాలి



తిప్పర్తి : అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ నర్సింహానాయక్


తిప్పర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని, వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మండల విద్యాధికారి నర్సింహానాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, అన్ని పాఠశాలల వంట ఏజెన్సీలకు, శానిటరీ వర్కర్‌లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో వంట వారు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. తాజా కూరగాయలతో పాటు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వంట ఏజెన్సీ సభ్యులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏజెన్సీలు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పాఠశాల పారిశుద్ధ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, వంటలపై అవగాహన

చండూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాలల్లో పాటించే పరిశుభ్రతపై స్కావెంజర్లకు, మధ్యాహ్న భోజనంపై కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొని వారికి పలు సూచనలు చేశారు. పాఠశాలల్లోని పరిశుభ్రత, వంటల్లో పాటించాల్సిన నాణ్యత, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ ఆపరేటర్ నాగభూషణాచారి, సీఆర్‌పీ సైదులు, పలువురు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను అణిచివేస్తున్న ఏపీ ప్రభుత్వం



నల్లబ్యానర్‌తో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు

నకిరేకల్ : ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ మీడియా స్వేచ్ఛను అణిచివేస్తూ ప్రభుత్వం పాలన సాగించడాన్ని ప్రజాస్వామ్యవాదులు అంతా ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ జిల్లా నాయకుడు గజ్జి రవి, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకుడు బొల్లికొండ లింగయ్య, సీపీఎం నాయకుడు ఏర్పుల తాజేశ్వర్ అన్నారు. సాక్షి టీవీలో నిర్వహించిన ఓ చర్చా కార్యక్రమంపై నిరసన పేరుతో ఏపీలో సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావు అక్రమ అరెస్టును, సాక్షి కార్యాలయాలపై దాడులు చేసి ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం పట్టణంలో జర్నలిస్టులు, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు నల్లబ్యానర్‌తో నిరసన పదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సాక్షి నియోజకవర్గ రిపోర్టర్ వడ్లకొండ రామసాయిలు, సాక్షి మీడియా ప్రతినిధి సుద్దాల వంశీ, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు చెట్టిపల్లి కాశీరాం, చెరుకు వెంకటాద్రి, సాకుంట్ల నర్సింహ, కాటేపల్లి శ్రీరాములు, చౌగోని శంకర్, వంటెపాక జమదగ్ని, వివిధ పత్రికల మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని మంగళవారం రాష్ట్ర కుష్ఠు వ్యాధి నివారణ బృందం సభ్యులు వెంకటేశ్వరచారి, శ్రీనువాస్‌రెడ్డి, అరుణ సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని వైద్య సిబ్బందికి కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి వైద్యచికిత్సను అందజేస్తే అంగవైకల్యం రాకుండా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. అనంతరం ఇటీవల వైద్య సిబ్బంది నిర్వహించిన కుష్ఠు వ్యాధి సర్వే రికార్డులను పరిశీలించారు. వారి వెంట వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ, పీఎంఓ భగవాన్ నాయక్, డీపీఎంఓ హనీఫ్, సీహెచ్‌ఓ శ్రీనివాసచక్రవర్తి, వైద్యసిబ్బంది శ్యామల పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌పై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు

శాలిగౌరారం : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు రోజురోజుకు పెరుగుతున్న జనాదరణ చూసి తట్టుకోలేక కుట్రపూరిత విధానాలతో ఆయనపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేదిలేదని డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ అన్నారు. మంగళవారంమండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేను రాజకీయంగా ఎదుర్కోలేని కొంతమంది దుర్మార్గులు కావాలనే మిమిక్రీ గొంతుతో కొన్ని సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. సమావేశంలో గూని వెంకటయ్య, తీర్పారి మల్లయ్య, బొల్లికొండ గణేశ్, భూపతి అంజయ్య,అల్లి సైదులు, నాయకులు పాల్గొన్నారు.

ధరణి బాధలు తొలగించేందుకే భూభారతి చట్టం

● ఎమ్మెల్యే మందుల సామేల్



శాలిగౌరారం : పెర్కకొండారం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



గట్టుప్పల్ : రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

శాలిగౌరారం : తెలంగాణ రాష్ట్రంలో రైతులు ధరణితో పడుతున్న బాధలను తొలగించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చి రైతులకు తీరని కష్టాలను, సమస్యలను తెచ్చిపెట్టిందన్నారు. పదేళ్ల భూముల సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అనంతరం మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, డైరెక్టర్ దేవరకొండ జయరాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు పల్స సైదులు, మంగదుడ్ల శ్రీను, లోకసాని రంగారెడ్డి, అల్లి సైదులు, శ్రీను, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

కనగల్ : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని బుడుమర్లపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ 50దరఖాస్తులు అందాయని తహసీల్దార్ బి.పద్మ తెలిపారు. తుర్కపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో 19దరఖాస్తులు అందాయని డీటీ నర్రి పార్వతమ్మ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విఘ్నేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ సునీత, ఏఆర్‌ఐ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ లతీఫ్, రైతులు పాల్గొన్నారు.

భూభారతి రైతులకు ఓ వరం

గట్టుప్పల్ : భూ భారతి చట్టం రైతులకు ఓ వరమని, బాధిత రైతులు సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు రైతులతో ముందుగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాములు, కార్యాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులో 241 దరఖాస్తుల స్వీకరణ

కేతేపల్లి : భూభారతి చట్టం అమలులో భాగంగా మండలంలోని చెర్కుపల్లి, ఇనుపాముల గ్రామాల్లో అధికారులు మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. చెర్కుపల్లి 107, ఇనుపాములలో 134 దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దారు సత్తార్ తెలిపారు.

నార్కట్‌పల్లి : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, అమ్మనబోలు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుల్లో ఆయా గ్రామాల్లో 205 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఆర్.రామకృష్ణ, ఆర్‌ఐలు కేవీ.తరుణ్, భవానీ, సర్వేయర్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ జాల వెంకటయ్య ఉన్నారు.

తిప్పర్తి : రైతులు రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పరుశురాం అన్నారు. మంగళవారం మండలంలోని ఇండ్లూర్, గడ్డికొండారం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇండ్లూర్‌లో 70 దరఖాస్తులు, గడ్డికొండారంలో 7దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూర్ : భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్‌బర్ట్ అన్నారు. మంగళవారం మండలంలోని చెర్వుఅన్నారం, బొల్లేపల్లి గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బొల్లేపల్లిలో గ్రామంలో 43, చెర్వుఅన్నారంలో 70దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్.కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఏజీఎం శ్రీకాంత్‌సాహూ

శాలిగౌరారం : రైతుల ఆర్థిక ప్రగతి కోసం ఎస్‌బీఐ అందిస్తున్న వ్యవసాయ అనుబంధ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్‌సాహూ అన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో జరుగుతున్న వ్యవసాయ రుణ అవగాహన వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో రైతులు, బ్యాంకు వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బ్యాంకు అందిస్తున్న సేవలు, రుణ సదుపాయాలు, వడ్డీరేట్లు, సకాలంలో రుణాలు చెల్లిస్తే పొందే ప్రయోజనాలు తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా రైతులు, బ్యాంకు వినియోగదారులు అడిగిన అనేక సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం బ్యాంకు వినియోగం, సకాలంలో రుణాలు చెల్లించిన రుణగ్రహీతలను శాలువాతో ఆయన సన్మానించారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్‌బీఓ క్రెడిట్ విభాగం చీఫ్ మేనేజర్ డి.వంశీ, బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది, వినియోగదారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా దైద రవీందర్



దైద రవీందర్

నకిరేకల్ : పట్టణానికి చెందిన దైద రవీందర్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. దైద రవీందర్ గత కొన్ని ఏళ్లుగా కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. గతంలో ఆయన టీపీసీసీ కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులు చేపట్టారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌ను పలువురు నాయకులు, అభిమానులు సన్మానించారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారికి నోటీసులు

కేతేపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో వివాదాస్పద ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వారికి గ్రామపంచాయతీ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. 1987 అప్పటి ప్రభుత్వం సుమారు 6ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసి గ్రామంలోని 28మంది నిరుపేద దళిత కుటుంబాలకు 200గజాల చొప్పున పంపిణీ చేసింది. పేదలకు పంచగా అంగన్‌వాడీ కేంద్రం పక్కన మిగిలిన కొంత భూమిని ఓ దళిత మహిళ, ఆమె కుటుంబ సభ్యులు కబ్జా చేసి చుట్టూ ఫెన్సింగ్ వేశారని కాలనీవాసులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన పంచాయతీ అధికారులు మంగళవారం సదరు వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలో వివాదాస్పద ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన ఫెన్సింగ్‌ను తొలగించాలని సదరు మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

అక్రమ కేసులు తొలగించాలి

మర్రిగూడ : అక్రమ కేసులను తొలగించి తమకు న్యాయం చేయాలని మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన బేర రాములు మంగళవారం కోరారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 13సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన ప్రవీణ్ వద్ద రూ.లక్షకు ఇల్లు కొనుగోలు చేసి గ్రామపంచాయతీలో దరఖాస్తు చేసుకోని ఆన్‌లైన్ చేసుకున్నానని, అయినా సదరు వ్యక్తి వచ్చి ఆన్‌లైన్ అక్రమంగా చేసుకున్నావని ఇంట్లోకి ప్రవేశించి నాపై దాడి చేశారని ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగకపోగా నాపై తిరిగి కేసు నమోదు చేశారని వాపోయారు.

సంక్షిప్త సమాచారం

పైడిమర్రి వెంకటసుబ్బారావుకు ఘన నివాళి

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రతిజ్ఞ రూపకర్త పైడిమర్రి వెంకటసుబ్బారావు జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ మాట్లాడారు. భారత దేశం నా మాతృభూమి భారతీయులందరూ నా సహోదరులు అంటూ పైడిమర్రి ప్రజల్లో దేశభక్తిని పెంపొందించారని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ మేఖల సంస్థ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సిబ్బంది నర్సింహారెడ్డి, కట్ట నాగయ్య, ఎం.నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పైడిమర్రి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నల్లగొండ పట్టణంలో ప్రతిజ్ఞ పద శిల్పి పైడిమర్రి వెంకటసుబ్బారావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పున్నమి అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే ×ప్రతిజ్ఞరూపకర్త అయిన పైడిమర్రి వెంకటసుబ్బారావు 1916 జూన్ 10న అన్నెపర్తిలో జన్మించారు. ఆయన రాసిన ప్రతిజ్ఞ వివిధ భారతీయ భాషలలో పాఠ్య పుస్తకాలలో చదువుతున్నా ఇప్పటి వరకు ఆయనకు రావాలిస్సిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పైడిమర్రి జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

చిట్యాల : ప్రతిఒక్కరూ యోగా ప్రాణాయామం చేయడంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని ఎంఈఓ పానుగోతు సైదానాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా మాసోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యోగా ఇన్‌స్ట్రక్టర్ కె.భజరంగ్‌ప్రసాద్ యోగాసానాలు వేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవి, ఫార్మసిస్ట్ సరిత, యోగా మహిళ ఇన్‌స్ట్రక్టర్ కన్నెబోయిన సరిత, ఆశా వర్కర్‌లు సైదమ్మ, జయమ్మ, శైలజ, గీతా, రజిత, కవిత, అంగన్‌వాడీ టీచర్ అపర్ణ పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

నల్లగొండ టౌన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ పార్కులో మంగళవారం హరిత యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ హోమియో డిపార్ట్‌మెంట్ డాక్టర్ చక్రధర నరసింహారావు మాట్లాడుతూ.. ప్రతిరోజు యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ సింగం ప్రవీణ్‌కుమార్, కోమల, వాకింగ్ క్లబ్ అధ్యక్షులు పర్వతాలు, శేఖర్, సైదులు, కృష్ణ, కవిత పాల్గొన్నారు.